వణికిస్తున్న.. చలి

- తగ్గుతున్న ఉష్ణోగ్రతలు
- చలికి తట్టుకోలేక జనం ఇబ్బందులు



చలి మంటలను కాచుకుంటున్న రైతులు

మరికల్: గడిచిన పదిరోజుల నుంచి ఆకాశం మేఘావృతంగా ఉండటంతో ఉష్ణోగ్రతలు సాధారణం కన్నా 2నుంచి 3డిగ్రీల వరకు తగ్గడంతో జిల్లాలో త్రీవమైన చలికి జనం వణుకుతున్నారు. చలి తీవ్రత గణనీయంగా పెరగడంతో ప్రజలు ఇళ్లలో నుంచి బయటకు రావాలంటే భయపడుతున్నారు. ఈ నెల ప్రారంభం నుంచి జిల్లాలో 16.4 డిగ్రీల కనిష్ట ఉష్ణోగ్రత నమోదవగా వారంరోజుల వ్యవధిలోనే 11.6 డిగ్రీల కనిష్టంతో చలి ఇక్కడి ప్రజల్ని వణికిస్తోంది. ఇదే తహరహాలో జిల్లాలోని ప్రధాన పట్టణాలైన మక్తల్, కోస్గి, మరికల్, మద్దురులో వాతావరణంలో మార్పులు కనిపించాయి. బలంగా శీతల గాలి వీస్తుండటంతో వృద్ధులు, పిల్లలు అవస్థలు పడుతున్నారు. ఉదయం ఆయ ప్రాంతాలను దట్టమైన పొగమంచు కప్పేస్తోంది. ఉదయం వేళ పనులకు వెళ్లే వారు విపరీతంగా అవస్థలు పడుతున్నారు. ఇక సాయంత్రం 6గంటలు దాటిందంటే రక్షణతో కూడిన జాగ్రత్తలు ప్రజలు తప్పనిసరిగా అవసరమవుతున్నాయి. రాబోయే రోజుల్లో మరింతగా కనిష్ట స్థాయిలో ఉష్ణోగ్రతలు పడిపోయే అవకాశముందని వాతావరణ శాఖ హెచ్చరిస్తోంది. ప్రజలు చలి గాలులకు అప్రమత్తంగా ఉండాలని వైద్యులు సూచిస్తున్నారు. చలికి తట్టుకోలేక చలిమంటలు కాచుకుంటున్నారు.

చలికాలంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు

- శరీరానికి ఎక్కువ చలి తగలకుండా దుస్తులతో కప్పేయాలి.
- చలికాలం క్రమం తప్పకుండా వ్యాయామం చేయాలి. దీంతో శరీరంలో రక్తప్రసరణ సరిగా జరుగుతుంది.
- చలికాలంల ఎక్కువగా వ్యాయామం స్కిప్ చేస్తారు.దీంతో బరువు పెరిగి ఇబ్బందులు వస్తాయి.
- శీతాలకాలంలో సమతుల ఆహారం తీసుకోవాలి. ఆహారంతోపాటు ఎక్కువగా నీళ్లు తాగాలి.
- చలికాలంలో చిప్స్ వంటి జంక్‌ఫుడ్ తినకపోవడం మంచిది.

జాగ్రతలు తప్పనిసరి

చలికాలంలో ఎక్కువగా గుండెజబ్బు వ్యాధులు వచ్చే అవకాశం ఉంటుంది. ప్రస్తుతం విపరీతమైన మంచు ప్రభావం ఉంది. దీంతో చలి తగలకుండా దుస్తులను ధరించాలి. ఎండ వచ్చిన తర్వాతనే బయటకు వస్తే మంచిది. ముఖ్యంగా వాకింగ్, వ్యాయమం చేస్తే బాగుంటుంది. ఈ సమయంలో ఎమైనా ఆరోగ్య సమస్యలు వస్తే వెంటనే వైద్యులను సంప్రందించాలి. తప్పనిసరిగా చలికాలంలో పాటించాల్సిన జాగ్రతలను పాటిస్తే మంచింది.

–డాక్టర్ రాఘవేందర్‌రెడ్డి, మరికల్

నియోజకవర్గ అభివృద్ధికి కృషి

- ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి

మక్తల్: నియోజకవర్గ అభివృద్ధికి కృషిచేస్తానని ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి అన్నారు. అలాగే మక్తల్ మున్సిపాలిటీ పరిధిలోని వార్డులకు తగిన ప్రాధాన్యత ఇస్తానని చెప్పారు. మంగళవారం పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో చైర్‌పర్సన్ పావని అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. పడమటి ఆంజనేయస్వామి జాతరకోసం వివిధ పనులకు చేసేందుకు రూ.లక్ష పనులు చేసేందుకు తీర్మానం చేశారు. పారిశుద్ధ్య అవసరాల కోసం ట్రాక్టర్ రిపేరు చేసేందుకు రూ.లక్ష ఖర్చు చేసేందుకు కౌన్సిల్ ఆమోదం తెలిపారు. వార్డుల్లో కరెంటు పనులు, పైపులైన్ లీకేజీ, రోడ్ల మరమ్మతుకు రూ.85 వేలు వెచ్చించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ మక్తల్ మున్సిపాలిటీలో అభివృద్ధి పనులు చేపట్టేందుకు అందరూ సహకరించాలని, అధికారులు సమయపాలన పాటించాలని, కార్మికులు వార్డుల్లో పారిశుద్ధ్య పనులు చేయాలని కోరారు. మున్సిపాలిటీకి ఆదాయం వచ్చే పనులు చేయాలని సూచించారు. ఈ నెల 25 నుంచి పడమటి ఆంజనేయస్వామి ఆలయ ఉత్సవాల్లో అందరు భాగస్వాములై విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్నిఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. అనంతరం ఎమ్మెల్యేను శాలువాతో సన్మానించారు. వైస్ చైర్మన్ అఖిలరెడ్డి, కమిషనర్ బాల్‌రాంనాయక్, ఏఈ నాగశివ, కౌన్సిలర్లు ప్రసన్నరెడ్డి, శంకరమ్మ, కౌసల్య, శంషుద్దీన్, సత్యనారాయణ, శ్వేతారెడ్డి, అర్చన, అనంపల్లి కొండయ్య, నర్సింహులు, రాములు పాల్గొన్నారు.

విద్యార్థుల అభ్యున్నతికి కృషిచేయాలి

- కలెక్టర్ కోయ శ్రీహర్ష



మాట్లాడుతున్న కలెక్టర్ కోయ శ్రీహర్ష

దామరగిద్ద: విద్యార్థుల సర్వతోముఖాభివృద్ధికి కృషిచేయాలని కలెక్టర్ కోయ శ్రీ హర్ష పాఠశాలల హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులను ఆదేశించారు. ప్రభుత్వ పాఠశాలలో అమలు చేస్తున్న ఎఫ్‌ఎల్‌ఎస్ కార్యక్రమం అమలుపై డీఈఓ అబ్దుల్ ఘని ఆధ్వర్యంలో స్థానిక రైతు వేదికలో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. ఎఫ్‌ఎల్‌ఎస్‌లోని ఆరు అంశాలను ప్రతి ఉపాధ్యాయుడు అమలు చేయాలన్నారు. అసైన్డ్‌మెంట్స్, వర్క్‌బుక్స్ మూల్యాంకనం చేసి ఎప్పటికప్పుడు యాప్‌లో నమోదు చేయాలన్నారు. ప్రతి పాఠశాలలో లైబ్రరీ పిరియడ్ అమలు చేసి విద్యార్థులు లైబ్రరీని ఉపయోగించుకునేలా ప్రోత్సహించాలన్నారు. కార్యక్రమంలో ఏఎంఓ విద్యాసాగర్, ఏఎస్‌ఓ శ్రీనివాస్, సీఆర్‌పీలు జాలీపానిటిక్స్ టీం తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

21న జనజాగరణ సమావేశం

దామరగిద్ద: అయోధ్య రామ మందిర్ పునర్నిర్మాణ ప్రతిష్ఠాపన కార్యక్రమంలో జనజాగరణ చేపట్టేందుకు 21న గురువారం సాయంత్రం 4 గంటలకు క్యాతన్‌పల్లి వీరభద్రేశ్వర స్వామి ఆలయంలో ప్రత్యేక సమావేశం నిర్వహిస్తున్నట్లు మండల సమితి బాద్యులు రాఘవేందర్‌గౌడ్, హన్మంతు, మాణిక్ తెలిపారు. ప్రతి గ్రామం నుంచి ఐదు మంది చొప్పున మండల సమావేశానికి హాజరు కావాలని కోరారు. అయోధ్య నుంచి పంపించిన అక్షింతలు పంపిణీ చేయనున్నట్లు తెలిపారు.

ఆన్‌లైన్ ఇసుకను ప్రారంభించాలి

మరికల్: ఆన్‌లైన్ ఇసుక రవాణా పూర్తిగా నిలిచిపోవడంతో గృహనిర్మాణాలకు ఇబ్బందులు పడుతున్నట్లు భవన నిర్మాణ సంఘం నాయకులు కుర్మయ్య, బాల్‌రాజ్, ఆంజనేయులు, సత్యన్న అన్నారు. మంగళవారం వారు విలేకరులతో మాట్లాడుతూ గత మూడు నెలల నుంచి ఆన్‌లైన్ ఇసుకను అధికారులు నిలిపివేయడంతో ఇళ్ల నిర్మాణాలు నిలిచి పనులు దొరకడం లేదన్నారు. అలాగే నూతన ఇళ్లు నిర్మించుకునే వారు కూడా నిర్మాణాలను పూర్తి చేసుకోలేకపోతున్నారని గుర్తుచేశారు. కోయిల్‌సాగర్ వాగు నుంచి ఆన్‌లైన్ ఇసుకను ప్రారంభించేందుకు అధికారులు చర్యలు తీసుకోవాలని వారు కోరారు.

ప్రమాదకరంగా మెట్లు



మాగనూర్: మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలోనిని ప్రధాన మెట్లు ప్రమాదకరంగా మారాయి. ప్రస్తుతం ఒకే చోట దాదాపుగా నాలుగు ప్రభుత్వ కార్యాలయాలు ఉండటంతో నిత్యం ప్రజలు పదుల సంఖ్యలో అవసరాల నిమిత్తం వస్తుంటారు. అయితే ప్రమాదకరంగా మారిన మెట్లు ఎప్పుడు కూలిపోతాయో తెలియని పరిస్థితి నెలకొంది. అధికారులు ముందస్తుగా స్పందించి ఎటువంటి ప్రమాదం జరగకముందే మెట్లను తొలగించాలని ప్రజలు కోరుతున్నారు.

సెమీ క్రిస్మస్ వేడుకలు



స్టేషన్ మహబూబ్‌నగర్: ఆరో నిజాం మీర్ మహబూబ్‌అలీఖాన్ ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు ఎం.ఎ.రహీం ఆధ్వర్యంలో మంగళవారం స్థానిక ఆర్‌అండ్‌బీ అతిథి గృహం ఆవరణలో సెమీ క్రిస్మస్ వేడుకలు నిర్వహించారు. ఎంబీ చర్చ్ చైర్మన్, సీనియర్ పాస్టర్ రెవరెండ్ ఎస్.వరప్రసాద్, సీనియర్ కాంగ్రెస్ నాయకుడు ఎన్‌పీ వెంకటేశ్ తదితరులు కేక్‌కట్ చేశారు. ఎం.ఎ.రహీం, ఎంబీసీ చర్చ్ వైస్ చైర్మన్ బీఐ.జేకబ్, కార్యదర్శి జేఐ.డేవిడ్, మాజీ టీజేఏసీ జిల్లా చైర్మన్ రాజేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మెరుగైన బోధన అందించాలి



కోయిల్‌కొండ: ప్రభుత్వ పాఠశాలల్లో ప్రైవేటుకు దీటుగా మెరుగైన బోధన అందించాలని ఎంపీడీఓ జయరాములు అన్నారు. మంగళవారం ఉమ్మడి తండా, కాస్లబండ తండా ప్రాథమిక పాఠశాలలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. విద్యార్థులకు చదువుతోపాటు క్రమశిక్షణ అవసరమన్నారు. వారికి మెనూ ప్రకారం మధ్యాహ్న భోజనం అందించాలన్నారు. అనంతరం గ్రామాల్లో నర్సరీలను పరిశీలించారు.

త్యాగాలను ఎప్పటికీ మరువొద్దు

స్టేషన్ మహబూబ్‌నగర్: ఆంగ్లేయుల పాలన నుంచి విముక్తి కోసం షహీద్ అష్ఫాఖుల్లాఖాన్, రాంప్రసాద్ బిస్మిల్ చేసిన ప్రాణ త్యాగాలను ఎప్పటికీ నాయకులు అన్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలో ఆల్‌పార్టీ ముస్లిం లీడర్స్ కోఆర్డినేషన్ కమిటీ కన్వీనర్ మోసీన్‌ఖాన్ ఆధ్వర్యంలో వారికి నివాళులర్పించారు. వారి చరిత్రను మరుగు పరచడం హేయమైన చర్య అన్నారు. ఆయా సంఘాల ప్రతినిధులు అబ్దుల్ హాదీ, జాకీర్ అడ్వకేట్, రఫీక్, ఎం.ఎ.జకీ, తకీ హుస్సేన్ అహ్మద్ సనా, షేక్ అబ్దుల్లా, హాఫిజ్ ఇద్రీస్, అన్వార్, ఈసా అమూది, ఇబ్రాహీం ఖాద్రీ పాల్గొన్నారు.

అభివృద్ధి పథంలో నడిపిస్తా..

- ఎమ్మెల్యే పర్ణికారెడ్డి

ధన్వాడ: నియోజకవర్గాన్ని అభివృద్ధి పథంలో నడిపించేందుకు కృషిచేస్తానని, ప్రతిఒక్కరూ సహకరించాలని ఎమ్మెల్యే పర్ణికారెడ్డి అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని ఫంక్షన్‌హాల్‌లో మండల కాంగ్రెస్ ఆధ్వర్యంలో కృతజ్ఞత సభ నిర్వహించారు. ఈ మేరకు ఆమె మాట్లాడుతూ పేట నియోజకవర్గంలోని ప్రతి గ్రామాన్ని అభివృద్ధి చేసే విధంగా ఎమ్మెల్యే నిధులతో ప్రణాళిక తయారుచేసి అభివృద్ధి కోసం కృషి చేస్తామన్నారు. వివిధ గ్రామాల ప్రజలు తమ సమస్యలను ఎమ్మెల్యేకి వివరించారు. సరైన రోడ్లు లేక ఆర్టీసీ బస్సు సౌకర్యం లేక ఇబ్బందులు పడుతున్నామని చెప్పారు. సమస్యల పరిష్కారానికి కృషిచేస్తానని ఆమె హామీ ఇచ్చారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు నరహరి, వైస్ ఎంపీపీ రాజేందర్‌రెడ్డి, ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు బాలకృష్ణ, బ్లాక్ కాంగ్రెస్ నాయకులు శివకుమార్, నిరంజన్‌రెడ్డి, లక్ష్మయ్యగౌడ్, దామోదర్‌రెడ్డి, వెంకట్రాంరెడ్డి, రాఘవేందర్‌రెడ్డి, ఆనంద్‌గౌడ్, రాంచంద్రయ్య, అచ్చిబాబు తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేకు సన్మానం

నారాయణపేట రూరల్: పేట నియోజకవర్గం నుంచి ఎమ్మెల్యేగా విజయం సాధించిన చిట్టెం పర్ణికారెడ్డిని మంగళవారం ఘనంగా సన్మానించారు. జిల్లాకు చెందిన ఏకైక రెగ్యులర్ ఎంఈఓ, లయన్స్ క్లబ్ అధ్యక్షుడు వెంకటయ్య, పీఈటీ అసోసియేషన్ అధ్యక్షుడు కతలప్ప, డిప్యూటీ డీఎంహెచ్‌ఓ శైలజ, సభ్యులు వేర్వేరుగా స్థానిక సీవీఆర్ భవన్‌లో కలుసుకుని శాలువాతో సన్మానించారు. మల్లికార్జున్, విశ్వనాథ్, గీత, కార్తిక్‌గందె పాల్గొన్నారు.

మరికల్: ఎమ్మెల్యే పర్ణికారెడ్డిని మండల రేషన్ డీలర్లు మంగళవారం క్యాంప్ కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిసి సన్మానించారు. అనంతరం రేషన్ డీలర్లు ఎదుర్కొంటున్న ప్రధాన సమస్యలను ఆమె దృష్టికి తీసుకెళ్లారు. ఎమ్మెల్యే సానుకులంగా స్పందిస్తు ఈ విషయాన్ని సీఎం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. మండల అధ్యక్షుడు ముకుందరెడ్డి, జానార్ధన్, సత్యరెడ్డి, తిరుపతిరెడ్డి, నర్సింహులుగౌడ్ పాల్గొన్నారు.

ఆలయంలో ప్రత్యేక పూజలు



మక్తల్: జనవరి 22న అయోధ్యలో జరగబోయే శ్రీ రాముల విగ్రహా ప్రతిష్ఠాపన పూర్తి కావడంపై మంగళవారం స్థానిక శ్రీ పడమటి ఆంజనేయస్వామి ఆలయంలో పూజలు చేశారు. అనంతరం గ్రామాలకు బీజేపీ కార్యవర్గ సభ్యుడు కొండయ్య చేతులమీదుగా ఆలయంలో గ్రామాలకు కలశం, అక్షింతలను అందజేశారు. కార్యక్రమంలో విభాగ్ ప్రచారక్ దేవేందర్, కావలి వెంకటేష్, శేఖర్, కల్లూరి నాగప్ప, కర్నిస్వామి, తిరుపతి, శ్రీనివాస్, కుర్మయ్య, బాల్‌రాంరెడ్డి పాల్గొన్నారు.

ఘనంగా తుల్జాభవాని పూజలు



నారాయణపేట రూరల్: మండలంలోని కొల్లంపల్లి పంచాయతీపరిధిలోని నల్లగుట్టతండాలో మంగళవారం తుల్జాభవాని అమ్మవారి పూజలను ఘనంగా నిర్వహించారు. గిరిజన కుటుంబాలు తండాలో అమ్మవారిని ప్రతిష్ఠించి, చక్కటి పుష్పాలతో అలంకరించారు. అనంతరం కుంకుమార్చన, ఇతర పూజలు చేసి మొక్కులు తీర్చుకున్నారు. కార్యక్రమంలో కృష్ణనాయక్, లక్ష్మణ్, తుక్యానాయక్, మంగ్యా, శ్రీను, శివ పాల్గొన్నారు.

జాతరకు బస్సులు నడిపించాలి

మరికల్: గున్ముక్లలో ఈ నెల 23నుంచి ప్రారంభమయ్యే కడపరాయుడి ఉత్సవాల జాతరకు భక్తుల సౌకర్యార్థం మండలం నుంచి జాతరకు ఆర్టీసీ బస్సులను నడిపించాలని గ్రామస్తులు ప్రతాప్‌రెడ్డి, రఘు, సత్యారెడ్డి అన్నారు. మంగళవారం వారు విలేకరులతో మాట్లాడుతూ ప్రతి ఏడాది జరిగే ఈ ఉత్సవాలకు బస్సులను నడిపించకపోవడంతో భక్తులు ఆటోలను సంప్రందించాల్సిన పరిస్థితి వస్తుందన్నారు. వారం రోజులపాటు నిర్వహించే జాతరలో ప్రధాన ఘట్టమైన ఉద్దాల ఊరేగింపు, రథోత్సవానికి పేట డిపోనుంచి మరికల్ మీదుగా గున్ముక్ల కడపరాయుడి ఉత్సవాల వరకు బస్సులు నడిపించేందుకు ఆర్టీసీ అధికారులు చొరవచూపాలన్నారు.

ఇంటింటికి అయోధ్య రాముడి అక్షింతలు



కరపత్రాలను విడుదల చేస్తున్న నాయకులు

కోస్గి: రానున్న జనవరి 22న అయోధ్యలో జరగబోయే శ్రీ రాముల విగ్రహ ప్రతిష్ఠాపనలో ప్రతి ఒక్కరికి భాగస్వామ్యం కల్పించాలనే లక్ష్యంతో అయోధ్య రామ క్షేత్ర ట్రస్ట్ వారు ప్రత్యేకంగా పూజించిన అక్షింతలు ఇంటింటికీ అందజేస్తున్నారని ఆ సంఘం స్థానిక నిర్వాహణ కమిటీ ప్రతినిధులు అన్నారు. ఈ మేరకు మంగళవారం గుండుమాల్ మండలానికి అయోధ్య పూజిత అక్షింతలు, కరపత్రాలు రావడంతో స్థానిక ప్రజాప్రతినిధులు, సంఘం నాయకులు కరపత్రాలను విడుదల చేశారు. అయోధ్య నుంచి వచ్చిన అక్షింతలు, ఇతర సామగ్రిని భక్తిశ్రద్ధలతో మేళతాళాలతో గ్రామంలోకి ఆహ్వానించారు. జనవరి 1నుంచి 15 వరకు అయోధ్య అక్షింతలను ఇంటింటికీ పంపిణీ చేయనున్నట్లు వారు తెలిపారు. ఈ మేరకు ఈ నెల 24న మండలస్థాయిలో నిర్వహించే సమావేశానికి అన్నిగ్రామాల ప్రతినిధులు హాజరై అక్షింతలు తీసుకెళ్లాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీపీ మధుకర్ రావు, నిర్వాహణ కమిటీ సలహాదారు రామాచారి, నాయకులు సురేష్‌రెడ్డి, బాలప్ప, వెంకటయ్య, రాములు, రాజయ్య, కృష్ణారెడ్డి, రాఘవేందర్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా అయ్యప్ప పడిపూజ



పడిపూజలో దీపాలు వెలిగిస్తున్న స్వాములు

మద్దూరు: మండల కేంద్రంలోని అయ్యప్ప పడిపూజ ఘనంగా నిర్వహించారు. శంకరప్ప స్వగృహంలో అయ్యప్ప ఆలయసపతి మంథ రవీంద్రనాథ్ శర్మ ఆధ్వర్యంలో స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. అలాగే మంగళవారం ఉదయం మద్దూరులోని జీడి ప్రకాష్ ఇంట్లో య్యప్పస్వామి వారికి పంచామృతాభిషేకం తదితర పూజ కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమాలకు మద్దూరు, దామరగిద్ద, కోస్గి, గొకుల్‌నగర్, తదితర గ్రామాలకు చెందిన స్వాములు వచ్చారు. పూజల అనంతరం భక్తులకు అన్నదానం చేశారు.

ఎస్సీ రిజర్వు చేయాలని వినతి



ఎంపీడీఓకు వినతి పత్రం అందజేస్తున్న యువకులు

దామరగిద్ద: మండలంలోని కాంసాన్‌పల్లిలో వచ్చే గ్రామ పంచాయతీ ఎన్నికల్లో సర్పంచ్ వార్డు మెంబర్ స్థానాలను ఎస్సీ రిజర్వే చేయాలని స్థానిక ఎస్సీ నాయకులు జిల్లా కేంద్రంలోని ఆర్‌డీఓ, డీపీఓ, దామరగిద్ద ఎంపీడీఓ కార్యాలయంలో మంగళవారం వినతి పత్రం అందజేశారు. ఇప్పటి వరకు పంచాయతీ సర్పంచ్ స్థానం ఎస్సీకి రిజర్వు కాలేదన్నారు. అధికారులు స్పందించి రిజర్వేషన్ కల్పించాలని కోరారు. కార్యక్రమంలో గ్రామ యువకులు తదితరులు పాల్గొన్నారు.

సహకార సంఘం డైరెక్టర్‌గా పాపిరెడ్డి



రెనివట్ల డైరెక్టర్‌గా ఎన్నికైన పాపిరెడ్డిని సన్మానిస్తున్న డైరెక్టర్లు

మద్దూరు: ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం దమ్‌గాన్‌పూర్‌లో రెనివట్ల డైరెక్టర్ రాజీనామ చేయడంతో మంగళవారం సహకార సంఘం సభ్యులు కో- ఆప్షన్ పద్ధతిలో డైరెక్టర్‌ను సహకార సంఘం కార్యాలయంలో ఎన్నుకున్నారు. దమ్‌గాన్‌పూర్ సహకార సంఘం చైర్మన్ బి. జగదీశ్వర్ చైర్మన్ పదవీకి, డైరెక్టర్ పదవీకి రాజీనామ చేయడంతో అయన ప్రాతినిత్యం వహిస్తున్న రెనివట్ల నియోజకవర్గానికి ఖాళీ ఏర్పడడంతో సహకార సంఘం డైరెక్టర్లు అందరు కలిసి ఏకగ్రీవంగా రెనివట్ల గ్రామానికి చెందిన పాపిరెడ్డిని డైరెక్టర్‌గా ఎన్నుకున్నారు. ఈ మేరకు.. నూతన డైరెక్టర్‌ను మిగితా డైరెక్టర్ల సన్మానించారు. ఈ ఎన్నిక సహకార సంఘం ఈసీఓ మహిపాల్ ఆధ్వర్యంలో కొనసాగింది. ఈ ఎన్నికకు డైరెక్టర్లు, ఇన్‌చార్జి చైర్మన్ ఆంజనేయులు హాజరైయ్యారు.

డిజిటల్ లావాదేవీలపై అవగాహన



క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న బ్యాంకు అధికారులు

మద్దూరు: కేంద్ర ప్రభుత్వం చేపట్టిన డిజిటల్ లావాదేవిలపై ఎస్‌బీఐ బ్యాంకు అధికారులు అవగాహన కల్పించారు. మంగళవారం మండలంలోని అతిథిగృహం వద్ద బ్యాంకు వినియోగదారులకు బ్యాంకు మేనేజర్ ప్రవీణ్ డిజిటల్ స్క్రీన్ ద్వారా అవగాహన కల్పించారు. దీని ద్వారా వినియోగదారులకు కలిగే లాభాలను వివరించారు. అనంతరం కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టన పథకాలను వివరించారు.

ఘనంగా మారెమ్మవ్వ బోనాలు



బోనాలతో అమ్మవారి గుడికి వెళ్తున్న గ్రామస్తులు

మాగనూర్: మండల కేంద్రంలో మారెమ్మవ్వ బోనాల ఉత్సవాలు మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామస్తులు మధ్యాహ్నం రెండుగంటల సమయంలో అంజనేయస్వామి దర్శనం అనంతరం బోనాలతో ఊరేగింపుగా అమ్మవారి ఆలయానికి బయలుదేరారు. అమ్మవారికి పొట్టేళ్లు, కోళ్లతో మొక్కులు చెల్లించుకున్నారు. బోనాల ఉత్సవాల సందర్భంగా ముంబాయి, సోలాపూర్, హైదారబాద్, బెంగళూర్ వివిధ ప్రాంతాల నుంచి భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.

ప్రయాణికుడికి సెల్‌ఫోన్‌అందజేత

స్టేషన్ మహబూబ్‌నగర్: కోయిల్‌కొండకు చెందిన ఇద్దరు ప్రయాణికులు మంగళవారం బస్సు దిగి ఎంక్వయిరీ రూం పక్కన కూర్చొని సెల్‌ఫోన్ మరిచి అక్కడి నుంచి వెళ్లిపోయారు. గమనించిన బస్‌స్టేషన్ కంట్రోలర్లు యాదమ్మ, రంగాచారి సెల్‌ఫోన్‌ను స్వాధీనం చేసుకున్నారు. విషయాన్ని డీఎం సుజాతకు వివరించారు. డీఎం సూచన మేరకు ప్రయాణికుడి వివరాలు తెలుసుకొని సెల్‌ఫోన్‌ను అందజేశారు. ఈ మేరకు వారిని డీఎం అభినందించారు.

స్టీల్ బ్యాంకు పరిశీలన



మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: స్థానిక మెప్మా భవనంలో ఏర్పాటు చేసిన స్టీల్ బ్యాంకును మంగళవారం లీడ్ బ్యాంకు డిస్ట్రిక్ట్ మేనేజర్ (ఎల్‌డీఎం) భాస్కర్ పరిశీలించారు. కాగా వివిధ శుభకార్యాలు, సమావేశాలు నిర్వహించే సమయంలో ఇక్కడి వంట పాత్రలు, గ్లాసులు, మగ్గులు, బేసన్లు, బోగన్లు, జగ్గులు తదితర వస్తువులను రోజువారీగా సప్లయింగ్ కంపెనీలలో వలే కిరాయికి తీసుకోవచ్చని సిబ్బంది వివరించారు. ప్లాస్టిక్ సామగ్రికి ప్రత్యామ్నాయంగా వీటిని ఉపయోగించవచ్చన్నారు. కార్యక్రమంలో సీఓలు యాదయ్య, దేవమ్మ, నిర్మల తదితరులు పాల్గొన్నారు.

చీరలతో పంటకు రక్షణ

కోస్గి: కష్టమొచ్చిన, నష్టమొచ్చిన తాను నమ్ముకున్న వ్యవసాయరంగాన్ని వదులుకోలేరు రైతన్నలు. విత్తనాలు వేసిన మొదలు పంట చేతికొచ్చే వరకు రైతులకు కష్టాలు తప్పడంలేదు. మండలంలోని చెన్నారం గ్రామ శివారులో ఓ రైతు సాగు చేసిన వేరుశనగా పంటను అడవి పందుల బారి నుంచి కాపాడుకునేందుకు పాత చీరలను చుట్టు రక్షణ వలయంగా ఏర్పాటు చేసుకున్న ఈ దృశ్యమే ఇందుకు నిదర్శనం.



పాత చీరలతో పంటకు రక్షణ వలయం